టీఈసీలో హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అవకాశం

పాఠశాల విద్య, నాణ్యత వర్కింగ్ గ్రూప్ సభ్యుడిగా ప్రొఫెసర్ నాగరాజు



రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్(టీఈసీ)లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అవకాశం దక్కింది. కమిషన్‌లోని పాఠశాల విద్యా, నాణ్యతపై వర్కింగ్ గ్రూప్ సభ్యుడిగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ నాగరాజు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని సోషియాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించేందుకు టీఈసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కమిషన్‌కు అవసరమైన సంస్కరణలపై అధ్యయనం, సిఫార్సులను చేసేందుకు వర్కింగ్ గ్రూప్ లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యలో నాణ్యతను మెరుగుపరిచేందుకు, సమస్యలను గుర్తించి సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన గ్రూప్‌లో ప్రొఫెసర్ నాగరాజుకు అవకాశం కల్పించారు. ఈ బృందంలో ఇప్పటికే హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ శాంతాసిన్హా, టీఐఎస్ఎస్ ప్రొఫెసర్ రేఖపప్పు ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ మాజీ డైరెక్టర్, బి శేషుకుమారి ఉన్నారు. వీరందరూ గతంలో హెచ్‌సీయూతో అనుబంధం కలిగి ఉన్న వారే కావడం విశేషం.

నాణ్యతకు తిలోదకాలు!

- అధికారుల పర్యవేక్షణ కరువు
- నీరు పోయకపోవడంతో బీటలు పడుతున్న సీసీ రోడ్డు
- నెలలు గడుస్తున్నా పూర్తికాని పనులు

చింతల్: అభివృద్ధి పనుల పై అధికారుల నిఘా లేకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టి ప్రజాధనం కొల్లగొడుతున్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.65 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండు రోజుల్లో రోడ్డు వేస్తామని తవ్వకాలు చేపట్టిన జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లు రెండు నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతె తమ ఇళ్లల్లోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన సీసీ రోడ్డు పనులు

రూ.68 లక్షలతో..

భగత్‌సింగ్ నగర్‌లో రెండేళ్ల క్రితం మంజూరైన పనులకు ఇటీవల టెండర్‌లు నిర్వహించి రూ.64 లక్షలతో రోడ్డు నెంబర్ 2 లో సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు వేసి మూడు నుంచి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ పనులు చేపట్టే కాంట్రాక్టర్ నీరు పోయక రోడ్డు బీటలు పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేసిన మర్నాడు మట్టి దెబ్బలు ఏర్పాటు చేసి నీరు పోయాల్సి ఉన్నా సదరు కాంట్రాక్టర్, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రోడ్డు నాణ్యత పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గల్లీలకు రోడ్లు బంద్

రోడ్డు నెంబర్ 2 నుంచి సుమారు కుడి, ఎడమవైపులకు 36 గల్లీలకు పైగా ఈ రోడ్డు కూడా వెళ్లే వెసులుబాటు ఉంది. రోడ్డు పేరుతో ఇళ్ల ముందు మెట్లు తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా వెళ్లే గల్లీలను ఏటవాలుగా వదిలేయడంతో గల్లీలకు వెళ్లే రోడ్లు బంద్ అయిపోయాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు వెళ్లే క్రమంలో, అత్యవసర విభాగానికి వచ్చే అంబులెన్స్, గ్యాస్‌బండ ఆటోలు, ఇతర వాహనాలు అటువైపు రావడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్డు నాణ్యత పై దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.



క్యూరింగ్ చేయని ప్రాంతం

నల్ల చెరువు పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- హైడ్రా అధికారులతో కలిసి చెరువు పనుల పరిశీలన

కూకట్‌పల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని చెరువు అభివృద్ధి కోసం ఇప్పటికే నిధులు మంజూరైన కారణంగా పనులు త్వరగా పూర్తి చేయాని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం హైడ్రా అధికారులతో కలిసి నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడినప్పుడు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కాకుండా పైపులైన్ నిర్మాణం చేపట్టి దిగువకు నీరు వెళ్లే విధంగా చూడాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు సమన్వయం చేసుకొని ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో హైడ్రా అధికారి డీఈ నాగరాజు, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు సి.సి. చిన్నా రెడ్డి, నిఖిల్ రెడ్డి, నాగప్రియ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బొడ్రాయి ప్రతిష్ఠ

కూకట్‌పల్లి: శంషీగూడ గ్రామంలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనుల పరిశీలన

మోతీనగర్: డివిజన్‌లో కీలకంగా ఉన్న సఫ్దార్ నగర్ నాలా విస్తరణ పనులను బుధవారం కార్పొరేటర్ సబిహాబేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరద ముంపు సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నాలా విస్తరణతో సున్నం చెరువు, మైసమ్మ చెరువుల నుంచి వచ్చే వరద ముప్పు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎన్‌డీపీ అధికారి ఈఈ శ్రీనాథ్‌రెడ్డి, డీఈ రాజ్యలక్ష్మి, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, అస్లాంబేగం, బాబా, మల్లేష్, రాంబాబు పాల్గొన్నారు.



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం, అధికారులు

ఉత్తమ ఎస్‌హెచ్‌ఓగా నరసింహరాజు



నరసింహరాజుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీపీ

బాలానగర్: బాలానగర్ సీఐ టి. నరసింహరాజు బుధవారం డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ఉత్తమ ఎస్‌హెచ్‌ఓగా ప్రశంసాపత్రంతో పాటు రివార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాల్లో సీఐ టి. నరసింహరాజు 9వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలాల విస్తరణ, పూడికతీత పనులను చేపట్టాలన్నారు. వరద ముంపు నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. గత పరిస్థితులను వివరించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూకట్‌పల్లి ఒకటని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బండి రమేష్ తదితరులు

నేడు హనుమాన్ జయంతి పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద శ్రీరంగ నాయక స్వామి వారి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. ఉదయం 6:30 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి వారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, సింధూరం పూజ, నాగవల్లి పత్రిక పూజ, విశేష పుష్పాలంకరణ 10:30 గంటలకు స్వామివారికి ప్రీతికరమైన మన్యుసూక్తంతో హోమం జరుగుతుందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేష్

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన జగ్గయ్యకు రూ. 37,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాలి బాలాజీ, లక్ష్మయ్య, పి.ఆర్. నాయుడు, రాజు, రమణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

సేవలను స్మరించుకున్న నేతలు

కూకట్‌పల్లి: దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులువేసి, ఆధునిక భారత్‌కు బాటలు వేసిన దార్శనికుడు, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని రాజీవ్ సర్కిల్ వద్ద డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గాలి బాలాజీ, నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేరి సతీష్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, గోపిశెట్టి రాఘవేందర్, సంజీవరావు, మేకల మైకేల్, కొండల్ రెడ్డి, తూము సంతోష్, అరవింద్ రెడ్డి, ప్రకాష్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, పొన్నం రజిత, మారుతీ, భారతమ్మ, జ్యోతి, బండి సుధా తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ సర్కిల్ వద్ద నివాళి అర్పిస్తున్న సర్వే సత్యనారాయణ, హరివర్ధన్ రెడ్డి, డా. సత్యం



నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు



గాంధీ భవన్‌లో పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న జావిద్ అలీ తదితరులు



కూకట్‌పల్లిలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నివాళి అర్పిస్తున్న నాయకులు



మూసాపేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షులు వేణు తదితరులు